నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 06, 2023 | www.navatelangana.com

నర్సరీ పెంపకంలో ప్రగతి సాధించాలి

నవతెలంగాణ-భీమిని



నర్సరీల పెంపకంలో ప్రగతిని సాధించాలని ఎంపీడీఓ జవహర్ లాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కర్జి భీంపూర్, అక్కలపల్లి పంచాయతీల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అవెన్యూ ప్లాంటేషన్‌ను పర్యవేక్షించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. లక్ష్యానికి అనుగుణంగా 2023 సంవత్సరానికి గాను నర్సరీ పెంపకానికి సంబంధించిన ప్రగతిని సాధించేల టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత వాతావరణం నెలకొల్పేల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపీఓ భాస్కర్ రావ్, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వినోద్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-భీమిని

మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో సోమవారం రాత్రి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంఘర్ష రవీందర్‌రావు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం రవీందర్‌రావు మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిచిన గడ్డం వినోద్ నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని బెల్లంపల్లి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి ప్రజల ఆశీర్వాదం పొందాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ సర్పంచ్ దారిశెట్టి వెంకయ్య, రాంపూర్ నాయకులు సతీష్, పోతరాజుల సురేష్, కటకం విజయ్, దారిశెట్టి శ్రీధర్, ముత్తయ్య, గన్నవరం రవీందర్ చారి, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

అధికారమొచ్చినా..చేజారిన స్థానాలు..!

- ఉమ్మడి జిల్లాలో ఆరు సీట్లను కోల్పోయిన కాంగ్రెస్
- పదింటిలో నాలుగు స్థానాలకే పరిమితమైన వైనం
- అసెంబ్లీ ఎన్నికల్లో విలక్షణ తీర్పునిచ్చిన జనం
- ఓటమిపై కారణాలు విశ్లేషిస్తున్న నాయకులు

రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుచుకొని అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ..ఉమ్మడి జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన ఫలితాలను చవిచూసింది. అధికార పార్టీని కాదని..కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టిన ప్రజలు ఉమ్మడి జిల్లాలో మాత్రం ఆ పార్టీని పూరిస్థాయిలో ఆదరించలేదు. పది స్థానాలకు గాను కేవలం నాలుగింట మాత్రమే విజయం దక్కడం ఆ పార్టీకి మింగుడు పడటం లేదు. కొన్ని స్థానాల్లో ఆ పార్టీ అధిష్టానం నిర్ణయం కారణమైతే..మరికొన్ని స్థానాల్లో అభ్యర్థుల స్వయం కృతాపరాధమే ఓటమికి కారణమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. కేవలం తూర్పు జిల్లాలో మూడు స్థానాలు ..పశ్చిమ జిల్లాలో కేవలం ఒకే స్థానానికే పరిమితమైన కాంగ్రెస్.. మిగితా ఆరు స్థానాల్లో ప్రత్యర్థి పార్టీలకు వదిలేసిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలివీచినా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



రాష్ట్రంలో తాజాగా విడుదలైన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వస్తే..ఉమ్మడి జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు ఎదురయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది స్థానాలు ఉండగా మెజార్టీ సీట్లను కాంగ్రెస్ కోల్పోయింది. కేవలం నాలుగు సీట్లకే పరిమితమైంది. ఏకంగా ఆరు సీట్లను కోల్పోయి ప్రతికూల ఫలితాలను ఎదుర్కొంది. ప్రస్తుతం తూర్పు జిల్లాలో మంచిర్యాలలో ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్‌లో వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లిలో గడ్డం వినోద్, ఖానాపూర్‌లో వెడ్మ బొజ్జు విజయం సాధించగా.. మిగితా ఆరు స్థానాలైన ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్, సిర్పూర్, ఆసిఫాబాద్ సీట్లను పార్టీ కోల్పోయింది. ఇందులో కొన్ని గెలవాల్సిన చోట్ల కూడా పార్టీ నిర్ణయాలు, అభ్యర్థుల తప్పిదాల కారణంగా ఓటమి చెందాల్సి వచ్చిందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఎందుకంటే రాష్ట్రంలో మెజార్టీకి అవసరమైన 64సీట్లను గెలుచుకొని అధికారం చేపట్టగా.. ఉమ్మడి జిల్లాలో మాత్రం భిన్నమైన ఫలితాలు రావడంతో అభ్యర్థులతో పాటు పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ వైపు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామనే సంతోషం తప్పితే..ఇక్కడ మాత్రం సీట్లను కోల్పోవడం వారికి ఇబ్బందికరంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలో కాంగ్రెస్ ఉండటం..ఇక్కడి ఆరు స్థానాల్లో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించడం కాంగ్రెస్ శ్రేణులను కలవరానికి గురిచేస్తోందనే వాదన వినిపిస్తోంది.

ఓటమికి కారణాలేంటీ..?

రాష్ట్రంలో అధికారం సాధించిన కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలో మాత్రం ఆరు సీట్లను కోల్పోవడం పట్ల ఆ పార్టీ శ్రేణులను అసంతృప్తికి గురిచేస్తోంది. కొన్నిచోట్ల పార్టీ టికెట్ల కేటాయింపులో ఆలస్యం చేయడం ఓ కారణమైతే.. అభ్యర్థుల స్వయం కృతాపరాధం మరో కారణమని తెలుస్తోంది. ఫలితంగా గెలిచే స్థానాలు చేజేతులా కోల్పోయారనే అభిప్రాయం వ్యక్తమైంది. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఓట్లు చీలిపోవడంతో పాటు క్షేత్రస్థాయి కార్యకర్తలను అంతగా పట్టించుకోకపోవడంతో పాటు పలు కారణాలు ఓటమికి కారణమయ్యాయని తెలుస్తోంది. బోథ్‌లో ఓ అభ్యర్థికి టికెట్ కేటాయించి అంతలోనే మార్పు చేసి మరో అభ్యర్థికి కేటాయించడంతో పాటు బరిలో బలమైన అభ్యర్థులు ఉండటం, ముధోల్‌లోనూ అభ్యర్థికి టికెట్ కేటాయింపులో చివరి వరకు వేచి చూడటం, ఆసిఫాబాద్‌లో కొత్త వ్యక్తికి టికెట్ కేటాయించడం..అక్కడ బలమైన సామాజిక వర్గం కలిగిన ప్రత్యర్థి ఉండటం, సిర్పూర్‌లో బలమైన ప్రత్యర్థులను ఎదుర్కొని నిలబడే సామర్థ్యం లేకపోవడం వంటి కారణాలు పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యాయనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోపక్క పార్టీ అభ్యర్థుల ఓటమిపై కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఓటమి చెందిన అభ్యర్థులు కారణాలను తెలుసుకుంటున్నారు. ఎందుకు ఇలా జరిగింది.. ఎక్కడ లోపం ఉంది..ఓట్ల చీలిక ప్రభావం ఎంత మేరకు చూపింది..ఏయే వర్గాలు ఎటువైపు మొగ్గచూపాయి తదితర వాటిపై సమీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థినులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ లలిత కుమారి తెలిపారు. డిసెంబర్ 3వ తేదీన లక్షెట్టిపేటలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల బాలుర కళాశాలలో నిర్వహించిన అండర్-19 స్కూల్ గేమ్స్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో లక్షెటిపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 7, 8, 9 తేదీలలో హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎం.రశ్మిత(1500మీటర్స్), ఎం.మనోహరికా (100 మీటర్స్), సీహెచ్.సహస్ర(షార్ట్ పుట్), డి.దీపిక(హై జంప్), జె.సంజన (400 మీటర్స్), బి.స్వర్ణ, విజేత(800 మీటర్స్), కె.కుంకుమ(3 కిలో మీటర్ రన్)లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా వీరిని కళాశాల ప్రిన్సిపల్ ఎం లలిత కుమారి, వైస్ ప్రిన్సిపల్ కె. మహేశ్వర రావు, అండర్-19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబురావు, కళాశాల ఉపాధ్యాయ బృందం పీడి, పీఈటీ మల్లిక, మమత అభినందించారు.

జోనల్ స్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు ఎంపికైన స్లేట్ విద్యార్థులు

నవతెలంగాణ-జన్నారం

జోనల్ స్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ క్రీడా పోటీలకు స్లేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగవ తేదీన బెల్లంపల్లి స్టేడియంలో నిర్వహించిన సెలక్షన్‌లో సాఫ్ట్ బాల్, బేస్ బాల్ అండర్-14 అండర్-18 విభాగాలలో స్లేట్ విద్యార్థులు ఎంపికయినట్లు తెలిపారు. అండర్-17 విభాగంలో కార్తీక్, సిద్ధార్థ, చరహాసన్, గణేష్, ప్రణతి, అక్షయలు, అండర్ ప్రోటీన్ విభాగంలో అరవింద, దియా, సుప్రీత్‌రెడ్డి, రిషిథ్‌లు ఎంపికయ్యారని, ఈ సందర్భంగా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్లేట్ విద్యాసంస్థల చైర్మన్, ప్రిన్సిపాల్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పూజ, పీఈటీలు సంతోష్, నాగేష్, శివ నాగలక్ష్మి, రమేష్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-వాంకిడి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని తమేళ గ్రామానికి చెందిన దేవుల బాపు(55) పని నిమిత్తం ఆసిఫాబాద్‌కు వెళ్లి పని ముగించుకొని తిరిగి రాత్రి ఆసిఫాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామమైన తమేళ గ్రామానికి వస్తుండగా చిన్న బెండారా వద్ద ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీ కొనడంతో బాపు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఏముల రమేష్ అనే రైతు ఎద్దు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. తిమ్మాపూర్ గ్రామ సరిహద్దులో ఉన్న తన పొలం వద్ద, ఎద్దు మేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర తీగ తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.40 వేల ఉంటుందని రైతు రమేష్ తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నారు.

సంఘవిద్రోహశక్తులకు సహకరించొద్దు

నవతెలంగాణ-వేమనపల్లి

సంఘవిద్రోహశక్తులకు గ్రామస్తులు సహకరించొద్దని నివ్వాయి చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై సుబ్బారావు అన్నారు. మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్లంపల్లి గ్రామంలో మంగళవారం జైపూర్ ఏసీపీ మోహన్ పర్యవేక్షణలో ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 40 మంది పోలీస్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు సరిగా లేని 18 బైక్‌లు, 01 ఆటోను సీజ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా కల్లంపల్లి ఫెర్రి పాయింట్ తనిఖీ, ఏరియా డామినేషన్ నిర్వహించి కల్లంపల్లి గ్రామంలో గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసులు ధ్యేయమన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రజలు అసాంఘిక శక్తులకు సహకరించవద్దన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, ఓటీపీ వివరాలను చెప్పవద్దన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వారు వస్తే ఆశ్రయం ఇవ్వద్దన్నారు. మావోయిస్టుల ప్రలోభాలకు ఆకర్షితులు కావద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్సై వెంకట్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్, ఎస్సై సుబ్బారావు

రక్తకణాలు దానం చేసిన నాజ్ ఫౌండేషన్ సభ్యుడు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

నాజ్ ఫౌండేషన్ సభ్యులు ముజాహిద్ మంగళవారం బి.పాజిటివ్ రక్త కణాలు దానం చేసి ఉదారతను చాటుకున్నాడు. లక్షెట్టిపేట మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడికి బి.పాజిటివ్ రక్త కణాలు అత్యవసరం కావడంతో నాజ్ ఫౌండేషన్‌ని సంప్రదించగా ఫౌండేషన్ సభ్యుడు సీసీకి చెందినఎండీ ముజాహిద్ రాత్రి రెండు గంటలకు మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్ వచ్చి రక్తకణాలు దానం చేశారు. ఈ సందర్భంగా పేషెంట్ బంధువులు నాజ్ ఫౌండేషన్ నాయకుడు సాదిక్‌కు, ముజాహిద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేడు అంబేద్కర్ వర్ధంతిని విజయవంతం చేయండి

నవతెలంగాణ-వాంకిడి

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని మండలకేంద్రంలోని జశ్వంత్ బుద్ధ విహార్‌లో బుధవారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అంబేద్కర్ సంఘం నాయకులు విజయ్, శ్యాంరావు, జయరాం తెలిపారు. ఉదయం జెండా వందనంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్ సంఘం నాయకులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని వర్ధంతిని విజయవంతం చేయాలని కోరారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా ప్రపంచ మతిక దినోత్సవం



నవతెలంగాణ-తాండూర్

పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం మారుతున్న వ్యవసాయ సాగు విధానాలతో భూమి తన సహజత్వాన్ని కోల్పోతుందని బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ తెలిపారు. మంగళవారం ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రైతు అవగాహన సదస్సులో మాట్లాడారు. మారుతున్న ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకొని రైతులు నేల స్వభావాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. మానవులతో పాటు జంతు వృక్ష జీవరాసులకు ప్రత్యక్షంగా పరోక్షంగా భూమి జీవనాధారమని తెలిపారు. ప్రస్తుత వ్యవసాయ విధానాల వల్ల భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోయి నిత్సారమవుతుందని తెలిపారు. పెరుగుతున్న జనాభా జనాభాకు అనుగుణంగా వ్యవసాయం ఉత్పత్తి సాధించడానికి రసాయన ఎరువులు వాడడం వల్ల నేల తన సహజతత్వాన్ని కోల్పోతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో భవిష్యత్ తరాలకు జీవనాధారమైన వ్యవసాయం ప్రశ్నార్థకమవుతుందన్నారు. రైతులు భూమి తన సహజత్వాన్ని కోల్పోకుండా ఆవుపేడతో పాటు సహజమైన జీవన ఎరువులను వినియోగించాలా కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ప్రియ, సుగంధి, తిరుపతి, నాగరాజు, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ విజయంలో కాందిశీకులే కీలకం

- ప్రభావం చూపిన కేంద్ర మంత్రి శాంతన్‌ఠాకూర్ పర్యటన
- కోనప్పకు గణనీయంగా తగ్గిన ఓట్లు



బెంగాళీ క్యాంపులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శాంతన్‌టాకూర్ (ఫైల్ ఫోటో)

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలో బీజేపీ విజయంలో కాందిశీకుల (బెంగాళీలు) ఓట్లే కీలకంగా మారాయా...! గణాంకాలు చూస్తే అదే నిజమనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నిక్లలలో బీఆర్ఎస్ వైపు మొగ్గ చూపిన కాందిశీకులు, ఈ అసెంబ్లీ ఎన్నికలలో మాత్రం బీజేపీకి అగ్రస్థానం కల్పించారు.

సిర్పూరు (టి) నియోజకవర్గంలో కాందిశీకులు అధికంగా ఉన్నారు. వీరికి దేశభక్తి అధికంగా ఉంటుంది. వీరి కుటుంబాలలో ఆర్మీలో పని చేసే వారే అధికంగా ఉంటారు. వీరు సాధారణంగా ప్రతీ ఎన్నికలలో బీజేపీవైపు మొగ్గ చూపుతారు. అదే సమయంలో బీజేపీ నుండి పోటీ చేసే అభ్యర్థి బలమైన అభ్యర్థా అవునా కాదా అని కూడా వారు పరిశీలించి మరీ ఓటేస్తారు. గత అసెంబ్లీ ఎన్నికలలో వీరు బీఆర్ఎస్ వైపు ఏకపక్షంగా ఓటేయగా, ఈ సారి మాత్రం బీజేపీకి మొదటి స్థానం ఇచ్చి ఐదు వేలకు పైగా మెజార్టీ అందించి హరీష్‌బాబు గెలుపులో కీలకపాత్ర వహించారు. కాగజ్‌నగర్ మండలంలో 13 క్యాంపులలో, రవీంద్రనగర్‌లో రెండు క్యాంపులలో బెంగాళీలు నివసిస్తున్నారు. కాగజ్‌నగర్ మండలంలో 10,991 మంది బెంగాళీ ఓటర్లు ఉండగా, రవీంద్రనగర్‌లో 2,489 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికలలో 10,326 మంది బెంగాళీలు ఓటు హక్కు వినియోగించుకోగా, 7,517 మంది బీజేపీకి ఓటు వేశారు. గత ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు అగ్రస్థానం కల్పించిన వీరు ఈ ఎన్నికలలో మాత్రం బీజేపీ వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం కూడా బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పనే అయినా వీరు కేవలం 2,277 మంది మాత్రమే అతనికి ఓటు వేయడం గమనార్హం. మొత్తంగా బెంగాళీలు 5,240 మెజార్టీని బీజేపీకి అందించారు.

కేంద్ర మంత్రి పర్యటనే కారణమా..

బెంగాళీలు గురువుగా భావించే కేంద్ర నౌకాయానం మరియు ఓడరేవుల మంత్రి శాంతన్ ఠాకూర్ ఈ ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. గత నెల 24న ఆయన ఈజ్‌గాం బెంగాళీ క్యాంపులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. బీజేపీకి ఓటు వేస్తే బెంగాళీలకు చేకూరే ప్రయోజనం గురించి సమగ్రంగా వివరించడమే కాకుండా ఎస్సీ సర్టిఫికెట్‌లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ రోజు జోరు వాన కురుస్తున్నా బెంగాళీలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆయన ప్రసంగాన్ని విన్నారు. బెంగాళీల ఓటు బ్యాంక్ ఎంతో కీలకమని గుర్తించి పాల్వాయి హరీష్‌బాబు కేంద్ర మంత్రి ఆరోగ్యం సహకరించకపోయినా పట్టుపట్టి మరీ తీసుకువచ్చి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారమే హరీష్‌బాబు గెలుపుకు కీలకంగా మారిందని ఇపుడు నియోజకవర్గంలో చర్చ సాగుతోంది.

బెంగాళీ క్యాంపులలో బూత్‌ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

నెం.	మొత్తం ఓటర్లు	పోలైనవి	బీజేపీ	బీఆర్ఎస్	మెజార్టీ
12	919	589	414	147	267
13	680	517	369	106	263
14	1167	871	629	209	420
15	970	664	501	134	367
16	893	719	560	122	438
17	1123	762	577	116	461
18	994	719	547	131	416
19	857	718	447	232	215
20	959	793	535	223	312
21	649	478	381	79	302
22	798	613	475	103	372
23	982	822	662	130	532
191	1221	967	654	274	380
192	1268	1094	766	271	495
	13,480	10,326	7,517	2,277	5,240

నాకు న్యాయం చేయాలని వేడుకోలు

నవతెలంగాణ-నస్పూర్

ప్రేమ వివాహం చేసుకున్న భర్త తనను వదిలిపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని వివాహిత పెండ్యాల శరణ్య అన్నారు. మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శ్రీరాంపూర్ కాలనీకి చెందిన శరణ్య నాగార్జున కాలనీకి చెందిన పెండ్యాల వినోద్ కుమార్ (ఆర్కే5 గని జనరల్ మజ్దూర్) 2017 నుంచి ప్రేమించుకున్నారని, ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలుసని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకున్న తర్వాత వినోద్ కుమార్‌కు సింగరేణి వారసత్వ ఉద్యోగం వచ్చిందని, అప్పటినుంచి తనను వివాహం చేసుకోనని అనడంతో శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం శ్రీరాంపూర్ పోలీసులు వినోద్ కుమార్ ను మందలించడంతో తనను ఆగస్టు 31 2022 రోజున తిమ్మాపూర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి గుడిలో వివాహం చేసుకున్నట్లు తెలిపారు. వివాహం చేసుకున్న తర్వాత ఇరు కుటుంబాల తల్లిదండ్రులు ఇంటికి రానివ్వకపోవడంతో కిరాయి తీసుకొని ఉన్నట్లు పేర్కొన్నారు. కొద్ది రోజుల తర్వాత బయట ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మా ఇంట్లో వాళ్లను ఒప్పించి ఇంటికి తీసుకు వెళ్తానని, కొద్దిరోజులు మీ అమ్మవాళ్ళ ఇంటివద్ద ఉండాలని వినోద్ కుమార్ చెప్పినట్లు పేర్కొన్నారు. ఆమె తన ఇంటికి వెళ్ళినప్పటి నుంచి కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని, దూరం పెడుతున్నాడని గ్రహించి అతని నిలదీయగా, వదిలించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వాపోయారు. వినోద్ కుమార్ మరో అమ్మాయిని వివాహం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాడని, ఈ విషయంపై మహిళా, స్థానిక పోలీసులకు పలు మార్లు ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఒకసారి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డానని, అయినా ఎవరూ తన బాధని పట్టించుకోవడంలేదని కన్నీటి పర్యాంతమయ్యారు. తనకు తన భర్తతో కలిసి ఉండేలా న్యాయం చేయాలని కోరారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | డిసెంబర్ 06, 2023 | www.navatelangana.com

నేడు అండర్-17 బాలికల హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో అండర్-17 బాలికల హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి (9440010453) హ్యాండ్ బాల్ క్రీడ శిక్షకుడు సునార్కర్ అరవింద్ (9550909870)ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా జట్లు ఉదయం 10 గంటలలోపు రిపోర్ట్ చేసేలా సంబంధిత జిల్లాల పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శులు సహకరించాలని పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు యూ డైస్‌పై శిక్షణ

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూ డైస్ ఫారంపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.మైసాజి మాట్లాడుతూ యూ డైస్ ప్లస్ సరైన నివేదికపై పాఠశాల అభివృద్ధి ఆధారపడి ఉంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, ఉపాధ్యాయుల నియామకం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాలు ఆన్‌లైన్‌తో పాటు సంబంధిత ప్రధానోపాధ్యాయులు వివరాలను సమర్పించాలన్నారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేస్తాయని వెల్లడించారు. కేజీ నుంచి ఇంటర్మీడియట్ కోర్సు వరకు చదివే విద్యార్థుల పూర్తి వివరాలను యూ డైస్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కేటీఆర్‌నీ కలిసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-బోథ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నమ్మకంతో తనకు టికెట్టు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎన్నికల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్‌తో కలిసి జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు.

పాయల్ శంకర్‌పై అభిమానంతో కొండగట్టుకు పాదయాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీజేపీ ఎమ్మెల్యేగా పాయల్ శంకర్ గెలుపు పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన పలువురు యువకులు కొండగట్టు ఆలయానికి 150 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే పాయల్ నివాసం నుండి కొండగట్టు ఆలయానికి కాళ్లకు చెప్పులు లేకుండా పాదయాత్రగా బయలుదేరారు. ఇందులో కేమ శ్రీకాంత్, పద్మావార్ రాకేష్, పాయల్ సాయి, నరేష్, సాయిగౌడ్ ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రపంచ మృతిక దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో వృక్ష శాస్త్రం శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మృతిక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచిత్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ మృత్తికను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు తమ వంతు పాత్రను పోశించాలన్నారు. తెలుగు అధ్యాపకుడు రాడపు సంతోష్ మాట్లాడుతూ మృతుకతో మనిషి జీవనం ముడిపడి ఉందని, ఇది లేకపోతే మనిషి జీవితం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జాకీర్, ప్రతాప్, రఘునాథ్, విజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోడ్ ప్రోగ్రాం ఆఫీసర్ దయాకర్, అశ్రఫ్ విద్యార్థులు పాల్గొన్నారు

బీజేపీని ఆదరించిన ప్రజలందరికి ధన్యవాదాలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలో మునుపెన్నాడు లేని విధంగా అత్యంత మెజారిటీ ఇచ్చి ఆదరించిన మండల ప్రజలకు మండల బీజేపీ నాయకులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గెలుపుకు కృషి చేసిన ప్రతీ కార్యకర్త, నాయకులకు, యువతకు ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీ ఎన్ని కుయుక్తులు పన్నిన బీజేపీ అభ్యర్థి గెలుపు కొరకు కృషి చేసిన యువతకు ఎంపీపీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఎవరికి దక్కని మెజారిటీ బీజేపీ అభ్యర్థికి దక్కడం గౌరవంగా బావిస్తున్నామని సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి అన్నారు. భారీ మెజారిటీ ఇచ్చిన మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షులు పొలాస గోవర్ధన్ మాట్లాడుతూ గ్రామ గ్రామన బీజేపీకి బ్రహ్మరథం పట్టిన మండల ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్, ఎంపీటీసీలు పడిగెల అనిత సురేష్, నర్సారెడ్డి, సర్పంచ్లు రవి, జీవన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సహకార సంఘ డైరెక్టర్ రాజేశ్వర్, నాయకులు ఓసా రాజు, సుమన్, రాకేష్, నర్సారెడ్డి, రవి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు యూడైస్ ప్లస్‌పై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం మండల స్థాయి యూడైస్ ప్లస్‌పై ఎంఈఓ వాసాల ప్రభాకర్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులకు యూడైస్‌పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలు, పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ఆన్ లైన్ చేసిన వివరాల ఆధారంగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు, పాఠశాల సౌకర్యాలు మంజూరు చేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి లచ్చయ్య కాంప్లెక్స్ హెచ్ఎంలు సాంబమూర్తి, సుధాకర్ నాయక్, రాథోడ్ రమేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీసీఓ రాంబాబు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సౌజన్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

పదిమందిలో నోటాదే పైచేయి



నవతెలంగాణ-నిర్మల్

పదిమంది ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే నియోజకవర్గంలో నోటాదే పైచేయి అయ్యింది. ప్రధాన పార్టీలు మినహా స్వతంత్రులు, మిగతా వారి కంటే ఎక్కువగా నోటాకు ఓట్లు పడగా నోటాదే పైచేయిగా నిలిచింది. నిర్మల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు ప్రధాన, వివిధ పార్టీలు, స్వతంత్రులు పోటీ చేశారు. కాగా ఫలితాలు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను పక్కన పెడితే, 10 మంది ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు వచ్చిన ఓట్లకన్నా ఎక్కువగా నోటా నన్ ఆఫ్ ఎబో కు ఓట్లు వచ్చాయి. ఇందులో బహుజన సమాజ్ వాది పార్టీ డి.జగన్ మోహన్‌కు 973 ఓట్లు రాగా, బహుజన ముక్తి పార్టీ అభ్యర్థి గొర్రె లింగన్నకు 337, ఏఐఎఫ్‌బీ పార్టీ అభ్యర్థి స్వదేష్ పరికిపండ్లకు 138, ఏఐడీఆర్‌పీ అభ్యర్థి ఎం. ఇంద్రకరణ్‌రెడ్డికి 410, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి రవీందర్ రామగిరికి 179, స్వతంత్ర అభ్యర్థులైన నైముద్దీన్‌కు 128, దేవోళ్ల రాజుకు 242, బుర్కా రాజేందర్‌కు 292, మల్లేష్ మద్దికుంటకు 837, సుదర్శన్ చౌహాన్‌కు 1,166 ఓట్లు వచ్చాయి. వీరందరిని దాటి నోటాకు 1,530 ఓట్లు వచ్చాయి. దీనితో ఈ అభ్యర్థులతో పోలిస్తే నోటాకు ఎక్కువ ఓట్లు రావడం విశేషం కాగా పదిమందిపై పైచేయిగా నోటా నిలువడంతో నోటా ప్రత్యేకతను చాటుకుంది.

ప్రిన్సిపాల్ వేధింపులపై ఉపాధ్యాయుల నిరసన



నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ప్రధాన గేటు ముందు మంగళవారం ప్రిన్సిపాల్ ఎండీ. రఫియోద్దీన్ వైఖరిని నిరసిస్తూ గురుకుల ఉపాధ్యాయులు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ మద్యం తాగి వచ్చి తమపై బూతు పదజలాలు వాడుతున్నారని ఆరోపించారు. నిబద్ధతతో తమ విధులను తాము నిర్వర్తిస్తుంటే విద్యార్థుల ముందు నానా బూతులు తిడుతూ, మానసిక క్షోభకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ వేధింపులను భరించలేక పోతున్నామని, గతంలో కూడా ప్రిన్సిపాల్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వేధింపులకు భరించలేక మనసిక ఒత్తిళ్లకు గురవుతున్నామని వారు వాపోయారు. నోటితో చెప్పలేని విధంగా బూతులు తిడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమను అయిన మార్చండి, లేదా ప్రిన్సిపాల్‌ను అయిన మార్చండి అంటూ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎం. సీతారాం, వేణుగోపాల్ రావు, టి.రవీందర్, ప్రేమ్‌కుమార్, విజయ్ డొంగ్రే, అమృతయ్య, దినేష్, ఆర్.భాస్కర్, కే.మల్లయ్య, వై.సురేష్ పాల్గొన్నారు.

సింగరేణిలో ఏఐటీయూసీనే గెలిపించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ- కాసిపేట

సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీనే గెలిపించాలని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిని కార్మికులకు అనేక హక్కులు సాధించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులను వారి త్యాగాలను కార్మికులు గుర్తుంచుకోవాలన్నారు. దీపావళి బోనస్‌ను బొగ్గు గని కార్మికులకు హక్కు సాధించింది ఏఐటీయూసీనే అన్నారు. కంపెనీ లాభాల్లో వాటా సాధించి, చరిత్రలో ఏ కంపెనీ లేని అగ్రిమెంట్ ఏఐటీయూసీ సాధించిందన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఇచ్చిన హామీలను అమలు పరచకపోవడం బాధాకరమని, మారు పేర్లు మారుస్తామని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు పెంచుతామని, సొంతింటి పథకం అమలు పరచకపోవడం సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడం చాలా విచారకరమన్నారు. సింగరేణిలో స్వేచ్చ లేకుండా రాజకీయ నాయకుల పెత్తనం వల్ల సింగరేణి అనేక అప్పుల ఊబిలోకి కూరుకపోయిందని అన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గించి యూనియన్‌కు కార్మికుల హక్కుల కోసం మాట్లాడే స్వేచ్చ ఉండాలన్నారు. ఈ నెల 27న సింగరేణి గుర్తింపు ఎన్నికలలో సింగరేణిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ చుక్క గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిప్ప నర్సయ్య, సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, ఎస్.నాగేశ్వరరావు, సభాధ్యక్షుడు మీనుగు లక్ష్మీనారాయణ, బొంకూరి రామచందర్ చొప్పరి శ్రీహరి, ఐ.సంపత్, ఆడెపు రవీందర్, అనిల్ రాజన్న, రఘురాం, సుందరం పాల్గొన్నారు.

నస్పూర్ : సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని నాయకులు మల్లేష్, సారయ్య అన్నారు. మంగళవారం ఆర్కే-7 గనిలో అలయ్‌బలై కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిసెంబర్ 27న సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికల్లో కార్మికుల హక్కులకై నిరంతరం పోరాడే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ని గెలిపించాలని కోరారు. సింగరేణిలో వర్కర్స్ యూనియన్‌గా 1942లో ఆవిర్భావించి 82 సంవత్సరాల పోరాట ఫలితంగా పటిష్టమైన నాయకత్వం కలిగి అనేక హక్కులు సాధించడం జరిగిందని అన్నారు. ఇటీవల 11వ వేతన బకాయిలు ఒకే దఫా చెల్లించాలని దీక్ష, జీఎం కార్యాలయాల ముట్టడి ద్వారా 23 నేలల బకాయిలు ఇప్పించామన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ప్రతాప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, సీరిలే షిఫ్ట్ సెక్రటరీ బానేష్, నాయకులు వెంకటేష్, మహేందర్, జితేందర్‌రెడ్డి, రాజ్ కుమార్, మధుకర్, నరేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విధానాలు నచ్చకనే రాజీనామా..!

- రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ గురువయ్య



నవతెలంగాణ-దండేపల్లి

స్థానిక నాయకుల ఒంటెద్దు పోకడలతో బీఆర్ఎస్ ప్రజల్లో బలహీన పడిందని ఏకపక్ష నిర్ణయాలతో పార్టీ ప్రతిష్ట దిగ జారిపోయిందని, విధివిధానాలు నచ్చకనే పార్టీని వీడుతున్నామని బీఆర్ఎస్ జిల్లా నాయకులు రైతుబంధు సమితి మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్ మోటపలుకుల గురువయ్య అన్నారు. మంగళవారం ముత్యంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పదవికి రాజీనామా చేస్తూ లేఖను వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపినట్లు, అలాగే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడానికి కారణం రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాలని ఆయన అన్నారు. పార్టీలో అధికార వికేంద్రీకరణ జరగడంలేదని అధికారం ఒకే చోట కేంద్రీకృతమై ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఒకే చోట ఉంటే ప్రజలకు న్యాయం జరగదని ఆయన అన్నారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాజీనామా చేసినవారిలో మాజీ సర్పంచులు అంబడిపల్లి శ్రీలత రవీందర్, కొట్టే సత్తయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫయాజ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ఇప్ప రమేష్, బీఆర్ఎస్వీ నాయకులు రాపల్లి జీవన్, ముత్తే బాబు, రాజలింగయ్య, అప్సర్ బైగ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న దుర్గం కార్తికేయ అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు జోగులాంబ గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థి మరింత మందికి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీడీ సట్ల శంకర్, పీఈటీ కోట యాదగిరి, ఆసిఫాబాద్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.సాంబశివరావు, క్రికెట్ అకాడమీ కోచ్ ఆచార్య విష్ణుకాంత్, కళాశాల అధ్యాపకులు కోసరి మహేష్ చంద్ర పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని రాచపూర్, వడ్యాల, లక్ష్మణచాంద గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. వాతావరణం ప్రతికులంగా ఉందని రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ అన్నారు. పొట్టపెల్లి(కే) గ్రామంలోని నర్సరీని పరిశీలించి, పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీలత, డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ నసీరుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్లు గోడౌన్‌కు తరలింపు



నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌లో భద్రపరిచామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం మూడు నియోజకవర్గాలకు సంబంధించిన సీయూ, బీయూ, వీవీ ప్యాట్‌లను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌లో భద్రపరిచి సీల్ వేసి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్లు రాకేష్, సత్యనారాయణ, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యూడైస్ అప్లికేషన్ వివరాల నమోదు తప్పనిసరి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

యూడైస్ ప్లస్ అప్లికేషన్‌లో పాఠశాలల సమగ్ర సమాచారం నమోదు చేయాలని సెక్టోరల్ అధికారి రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందరికీ ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశానికి రిసోర్స్ పర్సన్‌గా గోవర్ధన్ బాధ్యత వహించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన పాఠశాలల సమగ్ర వివరాలు నమోదు చేయాలని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డిస్టిక్ క్యాప్చర్ ఫార్మేట్‌లో అప్లోడ్ చేసుకుని తమ పాఠశాలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని అన్నారు. ఏదైనా తప్పులు ఉంటే సరిచేసి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం, పాఠ్యపుస్తకాల పంపిణి గురించి జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది అర్షద్, మహేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆలయ ధ్వజస్తంభ నిర్మాణనికి విరాళం అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయానికి ధ్వజస్తంభం తొడుగుకై హైదరాబాద్ పట్టణానికి చెందిన గురువు శ్రీసూర్యచంద్ర శర్మ సిద్ధాంతి స్థానిక ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం రూ.50 వేలు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాతో గురువును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రహ్లాద్, ఆలయ కమిటీ సభ్యులు ఓస రాజు, అంజయ్య, ఓస రవి పాల్గొన్నారు.

ఆర్మూర్ ఎమ్మెల్యేకు ఘన సన్మానం



నవతెలంగాణ-ముథోల్

నూతనంగా ఎన్నికైన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని మంగళవారం ఆయన స్వగ్రామానికి వెళ్లి ముథోల్ మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బాసర అమ్మవారి చిత్రపటాన్ని, అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందటంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి రావాలని వారు కోరారు. త్వరలో బాసరకు వస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు తాటివార్ రమేష్, సతీష్‌రెడ్డి , సప్పటోళ్ల పోతన్న, దశరథ్, అనిల్, శ్రీనివాస్, అగోల్ల యోగేష్, నవీన్, బాలు పాల్గొన్నారు.

20లోపు హజ్ యాత్రికులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



2024 సంవత్సరంలో హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు 20లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు షాహిద్ అహ్మద్ తవక్కల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హజ్‌కు వెళ్లేవారు పట్టణంలోని భుక్తాపూర్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తులు చేస్తామన్నారు. ఉదయం పది గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9849214764, 9394354477లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ సొసైటీ కార్యదర్శి ఎంఏ హసీబ్, జాయింట్ సెక్రెటరీ ఎంఏ షాహిద్, జఫిఉల్లాఖాన్, నూర్‌ఖాన్ పాఠన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

3

ఆదిలాబాద్

బుధవారం | డిసెంబర్ 06, 2023 | www.navatelangana.com

రేవంత్ ముఖ్యమంత్రి కావాలని నాగోబాకు పూజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆదివాసులు నాగోబాకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో కాంగ్రెస్ నాయకులు మెస్రం నాగనాథ్, పటేల్ వెంకట్‌రావ్, పూజారి షేక్ నాథ్, లచ్చు పటేల్, ఆత్రం అశోక్ ఆధ్వర్యంలో నాగోబాకు పూజలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని, దీనికి సీఎంగా రేవంత్‌ను నియామించాలని కోరుతూ నాగోబాకు ప్రార్థించినట్లు వారు తెలిపారు. అదే విధంగా ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదివాసీ బిడ్డ వెడ్మ బొజ్జుకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవీ ఇవ్వాలని కోరారు. పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించి అధిష్టానం సరైన గుర్తింపు ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రభుత్వ అధికారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

నూతన ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఆయన నివాసంలో కలిసిన అధికారులు పుష్పగుచ్చం అందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజ సమస్యల పరిష్కరించే దిశగా కృషి చేద్దామన్నారు.

స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో లోహిత్‌కు స్వర్ణం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆదిలాబాద్‌కు చెందిన క్రీడాకారుడు లోహిత్ సాయి స్వర్ణం సాధించారు. 200 మీటర్స్ బటర్ ఫ్లై విభాగంలో స్వర్ణ పతాకాన్ని గెలుచుకున్నాడు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడకారుడిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్దన్ రెడ్డి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్నీ పతకాలు సాధించాలని ఆకాక్షించారు. జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధం అయ్యేందుకు తను కోచింగ్ ఇస్తానని ఈ సందర్భంగా కొమ్ముకృష్ణ తెలిపారు.

పుట్టినరోజు సందర్భంగా విలేఖరి రక్తదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పుట్టిన రోజున సామాజిక బాధ్యతగా ఆదిలాబాద్‌కు చెందిన ఓ యువకుడు రక్తదానం చేసి ఉదారత చాటుకున్నాడు. పట్టణంలోని సుభాష్ నగర్ కాలానికి చెందిన విలేకరి గాజరి శ్రీకాంత్ తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేస్తు వస్తున్నాడు. ఇందులో భాగంగానే మంగళవారం తన పుట్టినరోజును పురస్కరించుకుని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి ఉదారతను చాటుకున్నాడు. రక్తదానం చేయడం ఇది నాల్గవసారి అని, యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. సామాజిక బాధ్యతగా తాను రక్తదానం చేయడాన్ని జర్నలిస్టులు, మిత్రులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సుధాకర్, సురేష్, నిలేష్, మహేందర్, మహేష్, వెంకటేష్ ఉన్నారు.

సొసైటీ డైరెక్టర్‌ను పరామర్శించిన మాజీ మంత్రి



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ శ్యామ్‌రావు పటేల్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గోడం నగేష్ మంగళవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోథ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అదే గ్రామానికి చెందిన మాధవి, లాలీబాయి, జంగుబాయిని పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ ఛైర్మెన్ కదం ప్రశాంత్, సర్పంచులు సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, కొడపా విజయ్, ఎంపీటీసీ జుగాది రావు, నాయకులు ఇమ్రాన్, సత్యనారాయణ, బాపురావు, లక్ష్మణ్, శ్రీను ఉన్నారు.

నేడు పత్తి కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-బోథ్

వ్యవసాయ మార్కెట్ పరిధిలోని బోథ్, పోచ్చెర, సోనాల జిన్నింగ్‌లలో సీసీఐ పత్తి కొనుగోళ్లనిలిపివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి దేవన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాతావరణం అనుకూలంగా లేనందున మిచెంగ్ తుఫాన్ వలన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. పత్తిని తీసుకువచ్చే సమయంలో రైతులు ఆరబెట్టుకొని తీసుకువరావాలన్నారు. నాణ్యమైన పత్తికి మార్కెట్ మంది ధర వస్తుందన్నారు. ఈ విషయంలో రైతులు సహకరించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీఓ నాయకులు, ఉద్యోగులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం టీఎన్జీఓ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. టీఎన్జీఓ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ నాయకులు తిర్మల్ రెడ్డి, గోపి, రాజేశ్వర్, ప్రశాంత్, అరుణ్, దేవేందర్, సునిల్, రవీ, ఓం ప్రసాద్, కలీం, దత్తు, గంగాదర్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గౌడ కులస్తులు

ఆదిలాబాద్ రూరల్ : ఎమ్మెల్యే పాయల శంకర్‌ను సర్దార్ సర్వయ్ పాపన్న గౌడ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కుల సంఘాల అభివృద్ధికి తన వంతుగా సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, సాయి, చైతన్య, నాగేందర్ గౌడ్, రాజు గౌడ్, ప్రణయ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో సీపీఐ కీలక పాత్ర

- జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో మిత్రపక్షమైన కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రకటించిన విధంగానే ఆరు గ్యారంటీల అమలులో సీపీఐ కీలక పాత్రను పోశిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. కొత్తగూడం నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివ రావ్ మేజార్టీతో గెలుపొందడాన్ని హర్షిస్తూ మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. భుక్తాపూర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద టపాసులు పేల్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మిత్రపక్షమైన కాంగ్రెతో రాష్ట్రంలో సీపీఐ మద్దతుగా పోటీ చేసిన ఒక్క స్థానంలో భారీ మేజార్టీతో గెలుపొందిందన్నారు. కాంగ్రెస్ కూడా భారీ మేజార్టీతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని తెలిపారు. ప్రజలను విస్మరిస్తే పుట్టగతులు ఉండబోవనే విషయాన్ని కేసీఆర్ గుర్తించారన్నారు. నియంత పాలనకు ప్రజలకు తగిన బుద్ది చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో సీపీఐ తన పాత్ర పోశిస్తుందని, ఎదైన తప్పు జరిగితే కాంగ్రెస్‌పై కూడా పార్టీ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నళినిరెడ్డి, అరుణ్ కుమార్, సాట్వాజీ, తబ్రేజ్, పర్వీన్ పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న సీపీఐ నాయకులు

స్త్రీలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

నవతెలంగాణ-జైనథ్

స్త్రీలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సరస్వతి అన్నారు. స్త్రీ హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 మానవ హక్కుల దినం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సఖీ కేంద్రం, డీహెచ్ఈడబ్ల్యూ విభాగం సంయుక్తంగా మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆషా వర్కర్స్‌కి, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినం ఈ సంవత్సరం యూనైట్ ఇన్వెస్ట్ టూ ప్రివెంట్ వయోలేన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ గర్ల్ గురించి వివరించామన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలున్నాయని, సమాజంలో టెక్నాలజీ పెరిగిన మహిళలు, చిన్నారులపై హింసలు ఆగడం లేదన్నారు. సఖి కేంద్రంలో వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అత్యవసర సమయంలో తమని సంప్రదించాలని సూచించారు. సఖి కేంద్రంలో అందించే సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ యశోద, మెడికల్ ఆఫీసర్ నయనతార, కమ్యూనిటి హెల్త్ ఆఫసర్ అంజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అశా వర్కర్స్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

కేంద్ర వృత్తి నైపుణ్య అభివృద్ధి మంత్రిత్వ శాఖ జన శిక్షణ సంస్థ ద్వారా అందించే శిక్షణాలు సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళశారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో జన శిక్షణ సంస్థ పాలకవర్గ సమావేశాన్ని సంస్థ ఛైర్మెన్ పిట్ల మమత అధ్యక్షతన నిర్వహించారు. దీనికి జిల్లా క్రీడాలు యువజన శాఖ జిల్లా అధికారి ఎస్ వెంకటేశ్వర్లు, డీఈఓ ప్రణీత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వృత్తి నైపుణ్య కోర్సులు నేర్చుకుంటు కుటుంబ ఆర్థిక పోషణలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలోని వివిధ మండలాలలో ప్రస్తుతం అమలవుతున్న శిక్షణ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తి అయిన శిక్షణాలను సంస్థ ఛైర్మెన్ మమత వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర ప్రసాద్, సేడ్స్ డైరెక్టర్ అర్ సురేందర్, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ చేన్నాల రాజన్న, సభ్యులు సీహెచ్ శశికళ, మసూద్, అన్వరి, డాక్టర్ చంద్రకాంత్, కాంబ్లే వర్ష, యోగిత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జన శిక్షణ సంస్థ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎస్ఓ

తుఫాను ప్రభావంతో పత్తి కొనుగోళ్లకు బ్రేక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మిచెంగ్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తుఫాను ప్రభావం ఉత్తర తెలంగాణపై ఎక్కువగా ఉండబోతుందని వాతావరణ శాఖ తెపాడంతో జిల్లాలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియను బుధవారం నిలిపివేస్తున్నట్లు మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. వర్షంతో పత్తి తడిపోయి రైతులకు ఇబ్బందులు కలుగుతాయనే ముందస్తుగానే మార్కెటింగ్ శాఖ పలు సూచనలు చేసిందన్నారు. బుధవారం కొనుగోళ్లు జరగవనే విషయం తెలుసుకున్న రైతులు మంగళవారం పెద్ద ఎత్తున తమ పత్తిని విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువచ్చారు. తుఫాను ప్రభావం కారణంగా వర్షాలు పడే సూచనలు ఉండడంతో బుధవారం కొనుగోళ్లను నిలిపివేస్తున్నామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కొనుగోళ్ల ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ వ్యాపారులు లక్ష 76 వేల 560 క్వింటాళ్లు, సీసీఐ 30 వేల 411 క్వింటాళ్లు మొత్తం 2 లక్షల 69 వేల 71 క్వింటాళ్లు కొనుగోళ్లు చేశామన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అంకోలి పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్ అన్నారు. ఈనెల 15న ఎన్‌క్యూఎస్ ఢిల్లీ బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఆయన మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని వాఘాపూర్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. సబ్ సెంటర్‌లోని రిజిస్టర్స్, రికార్డులు, పరికరాలు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఎమర్జెన్సీ మెడిసిన్, ల్యాబ్ పరికరాలు, చాట్స్, గార్డెన్‌లను పరిశీలించారు. సబ్‌సెంటర్‌కు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. 15న కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో సబ్‌సెంటర్‌లో వసతులుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఆడే సురేష్, బొమ్మెత సుభాష్, ఎంఎల్‌హెచ్‌పీ రోజా రమణి, ఆరోగ్య కార్యకర్తలు గెడం సంగీతా, సీహెచ్ లలితా, ట్రైనింగ్ స్టూడెంట్స్ ఆశా, దీప శ్రీ, ఆశా కార్యకర్తలు గౌరు బాయి, కమల, సుమన్ బాయి, కౌసేల్య, నాగుబాయి, శాంతాబాయి, భాగ్యలక్ష్మీ బాయి పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న యువకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ అభిమాన నాయకుడు పాయల శంకర్ ఎమ్మెల్యేగా గెలవాలని మహాలక్ష్మీవాడ యువకులు మొక్కులు మొక్కారు. ఆదివారం లెక్కింపులో పాయల శంకర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మంగళవారం మహాలక్ష్మీవాడ యువకులు కాలనీలో భారీ హనుమాన్ విగ్రహం వద్ద 101 కొబ్బరి కొట్టి తమ మొక్కులను చెల్లించుకున్నారు. దీంతో పాటు మరిన్ని మొక్కులు కూడా ఉన్నాయని వాటిని కూడా చెల్లించుకుంటామని యువకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ యువకుడు అక్షయ్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా పాయల శంకర్ గెలుపు కోసం అనేక కృషి చేశామన్నారు. దేవతలకు మొక్కులు మొక్కామని తెలిపారు. తమ కల నెరవేడంతో తమ మొక్కులను చెల్లించుకుంటున్నామని పేర్కొన్నారు. పాయల శంకర్ గెలుపుకు ప్రత్యేక్షంగా, పరోక్షంగా సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వారు ధన్యవాదలు తెలిపారు.

నేడు అంబేద్కర్ వర్ధంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో 67వ భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ కార్పోరేషన్ ప్రాంగణంలో జరిగే వేడుకలకు కలెక్టర్ రాహుల్ రాజ్, స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్‌తో పాటు అధికారులు పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా అంబేద్కర్ చౌక్, బస్టాండ్ ఎదుట గల అంబేద్కర్ విగ్రహం వద్ద, కైలాస్‌నగర్‌లో అశోక బుద్ధ విహార్‌లో వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. దీనికి బౌద్ధ ఉపాసిక, ఉపాసికలు, అంబేద్కర్ వాదులు, పార్టీలు, కుల సంఘాలకు అతీతంగా ప్రతి ఒక్కరు హాజరై వర్ధంతి కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దయానంద్, కోశాధికారి కాంతారావు, కుశ్వర్త బాయి లాండ్గె, అమరపాల, బేబీ బాయి, రాజు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ప్యానల్ టీం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని జామడ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ప్యానల్ టీం సందర్శించింది. దీనిలో భాగంగా టీం హెడ్ అనుషా పాఠశాల పరిసరాలతో పాటు తరగతి గదులు, సైన్స్ లాబ్, స్పోర్ట్ రూం, వంట గదులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను చూసి హర్షం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలను సైన్స్ మోడల్ పాఠశాలగా ఏర్పాటు చేయడం అభినందనీమన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ముందుగా మెను రిజిస్టర్‌ను పరిశీలించారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పీడీ అడే విశ్వనాథ్, ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, పుష్ప, శివాజీ, హరిచంద్, చంపావతి, గంగాధర్, మల్కు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
బుధవారం | డిసెంబర్ 06, 2023 | www.navatelangana.com

కిష్టాపూర్ కేజీబీవీ పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కిష్టాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని14 మంది ప్యానెల్ టీం ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీ చేశారు. ఫైనల్ టీం కోఆర్డినేటర్ సత్యనారాయణ తన టీంతో పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు అనుసరించాల్సిన అడ్మినిస్ట్రేటివ్ విషయాలను తెలియజేశారు. విద్యా బోధనపై పలు అంశాలను ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఆయన ఫామ్ హౌస్‌లో ఆసిఫాబాద్ నూతన ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో జరిగిన పలు అంశాలు కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లినట్టు తెలిపారు. ప్రతిపక్ష పాత్ర పటిష్టంగా నిర్వహిస్తామని తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించాల్సిన అంశాలపై చర్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

మార్పు కోసం సీఐటీయూని గెలిపించాలి

- సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు, గోపాల్

నవతెలంగాణ-మందమర్రి

మార్పు కోసం సీఐటీయూనీ గెలిపించాలని సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ సింగరేణి కార్మికులను కోరారు. మందమర్రి కెకె 5 గనిపై వడ్లకొండ శివ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో కార్మికులు మార్పు కోరినట్లుగానే అనునిత్యం సమస్యలపై పోరాడుతున్న సీఐటీయూ సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏరియాలో గెలిచి యాజమాన్యానికి అనుకూలంగా ఉంటున్న టీబీజీకేఎస్, ప్రాతినిధ్య సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ సంఘాల వల్ల క్వార్టర్ లేని కార్మికులకు వచ్చే ఇంటి కిరాయి ఆపిన విషయంలో కార్మికుల పక్షాన పోరాటం చేసి ఇప్పిస్తున్నామని తెలిపారు. ఆక్టింగ్ ప్రమోషన్లు, సర్ఫేస్ మజ్దూరు, గనులకు వచ్చే రోడ్ల రిపేరు లాంటి సమస్యలపై ఎప్పటికప్పుడు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి సాధించడంలో సఫలమయ్యామని తెలిపారు. ప్రాతినిధ్య సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ టీబీజీకేఎస్‌కు అనుకూలంగా మారి కార్మికులను క్వార్టర్లు, ప్రమోషన్లు, డిప్యూటేషన్ల విషయంలో రెండు యూనియన్లు కలిసి కార్మికులను దోచుకున్నారని ఆరోపించారు. సీఐటీయూ ఏరియాలో గెలిస్తే సింగరేణి కార్మికుల క్వాటర్లను నిజాయితీగా కార్మికులకు కేటాయించేలా కృషి చేస్తామన్నారు. ప్రతి సమస్య మీద సీఐటీయూగా ముందు ఏదో ఒక నిరసన కార్యక్రమంతో కదిలితేనే మిగిలిన ఇతర సంఘాలు తమ బాటలో నడుస్తున్నాయని తెలిపారు. అన్నీ యూనియన్లకు మార్గదర్శకంగా ఉంటూ ఎలాంటి అవినీతికి పాల్పడకుండా కార్మిక సమస్యలపై నిజాయితీగా పోరాడుతున్నామన్నారు. ఏరియాలో ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతున్న తమను గెలిపిస్తే సర్ఫేస్‌లో పని చేసే నాయకులను వారి డిజిగ్నేషన్‌కు పంపించి పనిచేసేలా చేస్తామని హామీ ఇచ్చారు. సొంతింటి కల, అలవెన్స్‌లపై ఐటీ మాఫీ, కార్మికులకు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తూ శాసనసభ ఎన్నికల్లో రాజకీయ పార్టీల చేత స్పందించేలా చేయడంలో తాము ముందున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ సంకె వెంకటేష్, బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య, అలవాల సంజీవ్, ఆర్గనైజరులు దొండ నవీన్, ఆదర్శ్, చైతన్య రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

హరీష్‌బాబును సన్మానించిన మాజీ ఆర్మీ అసోసియేషన్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

నూతనంగా ఎన్నికైన సిర్పూరు-టి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును మంగళవారం ఎక్స్ ఆర్మీ అసోషియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ తన గెలుపులో ఎక్స్ ఆర్మీ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శివ, కిషన్, అనిరుద్, రమాకాంత్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తానని అన్నారు. మంగళవారం మండలంలోని టోంకిని గ్రామంలో సిద్ధి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు నన్ను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు అన్నివేళల నాపై ఉంచి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. తన తండ్రి పాల్వాయి పురుషోత్తమ్‌రావు ఆశయాలను నెరవేర్చడానికి ముందుంటానని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ సహకరిస్తూ, ఏవైనా సమస్యలుంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎలాంటి సమస్యలున్నా నాకు తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తానని, ఎవరి ప్రమేయం లేకుండా నా కార్యాలయానికి రావాలని కోరారు. రాబోయే కాలంలో మరిన్ని సేవలందిస్తానని అన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ నేరేటి రేఖ, మండల అధ్యక్షుడు ఎలుములె శంకర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో చదువుతున్న జక్కుల అద్రిజ, వేదాంష్ జిల్లా కేంద్రంలోని ఎస్‌జీఎఫ్ ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో అండర్-14 బాస్కెట్‌బాల్‌కు రాష్ట్రస్థాయిలో ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సుమలత, వ్యాయామ ఉపాధ్యాయుడు కిరణ్ కృష్ణ, కోచ్ వంశీకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన న్యూస్ పేపర్స్ బాయ్స్ అండ్ ఏజెంట్ అసోసియేషన్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త గెలవడంతో న్యూస్ పేపర్స్ ఏజెంట్స్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ఇంటి వద్ద కలిశారు. శాలువాను కప్పి పూల బొకే అందించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యూస్ పేపర్స్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు. పలువురు నగర ప్రజలు వారి, వారి అసోసియేషన్ల వారీగా వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

బురే దిన్ ఖతం హోగయే.. అచ్ఛేదిన్ అనే వాలే హై..

నవతెలంగాణ-నవీపేట్

రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం సీఎం అభ్యర్థిగా ప్రకటించడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితో పాటు సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో మూడు పర్యాయాలు నియోజకవర్గంలో సుపరిపాలన చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల దరిద్రపు పాలన దూరం కాబోతుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్, కృష్ణ, జబీర్, గౌతమ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో సంబరాలు

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని తానాకుర్తి గ్రామంలో రేవంత్ రెడ్డిని సీఎంగా ప్రకటించిన వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాసంచాలు పేల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మాజీ విండో చైర్మన్ సూర్య రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ కు తగిన నాయకుడు రేవంత్ రెడ్డి అని ఆయన నాయకత్వంలో ప్రజలకు పూర్తి న్యాయం జరుగుతుందని. ముఖ్యంగా కుటుంబ పాలన నుండి విముక్తి కలిగిందని రేవంత్ రెడ్డి సహకారంతో రూరల్ నియోజకవర్గం లో భూపతిరెడ్డి పాలనలో రూరల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెంది ప్రగతి పథంలో ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇరిగేషన్ స్థల ఆక్రమణపై విచారణ

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని బాసర మూలమలుపు వద్ద ఇరిగేషన్ కాలువ స్థలంపై నివాసగృహం నిర్మాణంపై ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ మంగళవారం విచారణ చేపట్టారు. వార్డు సభ్యురాలు శోభ ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇరిగేషన్ స్థలాన్ని కొలతలు నిర్వహించారు. గృహ నిర్మాణం ఇరిగేషన్ స్థలంలోనే ఉందని నోటీసు జారీ చేశారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఆయన తనయుడు బాజిరెడ్డి జగన్‌తో ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామాబాద్ రూరల్ ఎన్నికల వివరాలను తెలుపుతూ ఆయనతో మాట్లాడారు. అలాగే బాజిరెడ్డి జగన్ కేటీఆర్‌తో కూడా ఎలక్షన్ వివరాలను తెలిపారు.

ఖాళీగా ఉన్న పీజీ సీట్లను భర్తీ చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 200 పీజీ సీట్లను వేంటనే భర్తీ చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం పిడిఎస్‌యూ యూనివర్సిటీ కమిటి ఆధ్వర్యంలో పారిపలన భవనం ముందు ధర్నా నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో 2023 -24 విద్యా సంవత్సరంలో పిజి అడ్మిషన్లలో అన్ని కోర్సులలో కలిపి 200 సీట్లు మిగిలిపోయాయని అన్నారు. కొన్ని కోర్సుల్లో సగం సీట్లు మాత్రమే నిండుతున్నాయని, దానివల్ల కోర్సులు ఎత్తివేసే అవకాశం ఉందని తెలిపారు. ఏటా వందల సంఖ్యలో సీట్లు మిగిలిపోతున్నాయని, స్పాట్ కౌన్సిలింగ్ లేదా మరొక కౌన్సిలింగ్ ద్వారా అయినా పీజీ సీట్లను భర్తీ చేసి గ్రామీణ పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు శివసాయి, ఆకాష్, హన్మాండ్లు, అశ్విత్, తరుణ్, రాము, రాజు, మన్యం కొండ, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సబ్జెక్ట్ టీచర్లు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రమాదేవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయం నుంచి ఆశ్రమ పాఠశాలల పదవ తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ నుంచి జారీ చేసిన పదవ తరగతి వంద రోజుల ప్రత్యేక కార్యాచరణను తమతమ పాఠశాలలో అమలుపరచాలన్నారు. ఎస్ఏ-వన్ పరీక్షల ఆధారంగా వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. వెనుకబడ్డ విద్యార్థులను సబ్జెక్ట్ ఉపాధ్యాయులు దత్తత తీసుకొని సబ్జెక్ట్ పరంగా సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. రోజువారీగా సబ్జెక్టులలో స్లిప్ టెస్ట్ నిర్వహించి పరీక్ష పత్రాల మూల్యాంకం చేసి విద్యార్థులను ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనాలు వేసి విద్యార్థులు పదవ తరగతిలో మంచి గ్రేడ్‌తో పాటు వంద శాతం ఉత్తీర్ణత అయ్యేలా సబ్జెక్టు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. వందరోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేసేందుకు ప్రత్యేక అధికారులను పర్యవేక్షణకు నియమించినట్లు తెలిపారు. నిర్లక్ష్యం చేసిన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గత నెల నుంచి ప్యానెల్ తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పనితీరు, విద్యా బోధన, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా ప్యానల్ టీం పర్యవేక్షించి నివేదికలు సమర్పించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓలు క్షేత్రయ్య, ఖమర్ హుస్సేన్, పురుషోత్తం, జీసీడీఓ శకుంతల, స్పోర్ట్స్ ఆఫీసర్ మీనారెడ్డి పాల్గొన్నారు.

నేల విలువను తెలుసుకుని సంరక్షించాలి



టటటటటటటటటట

- ఏఈఓ చిరంజీవి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేల విలువను తెలుసుకొని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఏఈఓ చిరంజీవి అన్నారు. మండలంలోని తుంపల్లి గ్రామంలో వాసన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలలో సారం పెరగాలంటే వందల సంవత్సరాలు పడుతుందని, అటువంటి నేలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుతం వాడుతున్న మందులతో భూసారం తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వైపు రైతులు మల్లాలని సూచించారు. నేల సారం పెంచడానికి తమ శాఖ ఎప్పటికప్పుడు కృషి చేస్తుందని, అవసరమైన సహాయ సహకారాలకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది జయవర్ధన్, తిరుపతి, భీమ్‌రావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర సీఎంగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకటించినందుకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరుపున సోనియా గాంధీకి, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీకి ధన్యవాదాలు అని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రజల అభీష్టం మేరకు కార్యకర్తల ఆలోచనలకు అనుగుణంగా అధిష్టానం నిర్ణయం తీసుకున్నందుకు అధిష్టానానికి ధన్యవాదాలని పేర్కొన్నారు. రాబోయే కాలంలో సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సేవ చేస్తూ జిల్లాను అభివృధి వైపు తీసుకెళ్తామని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం రియల్ ఎస్టేట్ ఆఫీసుగా మారింది

నవతెలంగాణ-ఆర్మూర్

రియల్ ఎస్టేట్ ఆఫీసుగా మున్సిపల్ కార్యాలయం మారిందని బిజెపి ఫ్లోర్ లీడర్ జివి నరసింహారెడ్డి అన్నారు. మున్సిపల్ ఆఫీస్ ముందు బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం వచ్చిన నాలుగు సంవత్సరాల నుంచి పెర్కిట్, మామిడిపల్లి, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఇరిగేషన్ భూముల్లో ఇంటి నెంబర్లు మంజూరు చేస్తూ లక్షల రూపాయలు చేతులు మారినా ఖాళీ ప్లాటుకు ఒక హౌస్ నెంబర్ జోడించి ఆ హౌస్ నెంబర్లకు మున్సిపల్ రికార్డులు లేకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. మున్సిపల్ అధికారులకు ముడుపులు ముట్టిన వెంటనే చైర్మన్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు అందడంతో ఈ హౌస్ నెంబర్‌ను అనుమతించారని ఆరోపించారు. మున్సిపాలిటీ ఒక రియల్ ఎస్టేట్ ఆఫీస్ లాగా నాలుగు దిక్కుల నుంచి నలుగురు చైర్మన్లు పరిపాలిస్తున్నారని అన్నారు. టౌన్ ప్లానింగ్ కమిషనర్, పాలకవర్గం కలిసి ఆర్మూర్ మున్సిపల్‌ను దోచుకుంటున్నారని తెలిపారు. మున్సిపల్‌లో 100 కోట్లు అవినీతి జరిగిందని, దీన్ని కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి సిటింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉదయ్ కుమార్, కౌన్సిలర్ సాయికుమార్, ఆకుల శ్రీనివాస్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పోల్కం వేణు, నర్సారెడ్డి, కార్యకర్తలు యువ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

మగ్గిడి పాఠశాలకు కుర్చీల వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలకు కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు తమ వంతు సేవలు ఎల్లప్పుడు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిత మాట్లాడుతూ రోటరీ సేవలు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీనారాయణ ,ప్రాజెక్టు చైర్మన్ స్పాన్సర్ కోట నరేష్, రోటరీ సభ్యులు శశిధర్ పాఠశాల ఉపాధ్యాయులు కిషన్, అనిల్ , విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల ర్యాలీ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం(పి) చౌరస్తా నుండి ఎల్లమ్మ కుంట తండా వరకు మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, తెలంగాణ ఇచ్చిన పార్టీ తెలంగాణను అభివృద్ధి చేసే పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీ అన్నారు. కార్యకర్తలు రాత్రి అనక పగలనకా కష్టపడ్డందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. కచ్చితంగా రైతులకు, నిరుపేదలకు మంచి రోజులు వచ్చాయని ఆయన తెలిపారు. దాదాపు పది సంవత్సరాల కాలంలో తనతో పాటు మరికొంతమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ ప్రభుత్వం వేధింపులకు గురిచేసిందని, భయపడకుండా పోరాడుతూ ఎదిరించామని అన్నారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు చాలా విరక్తి చెందారని ఏ పథకంలో, సంక్షేమంలో కమిషన్లు ఇచ్చేంతవరకు పేదవాడికి ఆ పథకం లబ్ధి పొందలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సమన్యాయ పాలన ఉంటుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మండల అధ్యక్షుడు బున్నె రవి తదితరులు పాల్గొన్నారు.

8న మండల సాధారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 8న మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంతోష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలను 25 కాపీల జిరాక్స్ ప్రతులను ఈనెల 7లోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు సకాలంలో హాజరై సహకరించాలని ఎంపీడీవో కోరారు.

రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ కాబోయే ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డిని మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని హోటల్ ఎల్లాలో రేవంత్ రెడ్డిని కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు. పది సంవత్సరాలు కార్యకర్తల పోరాట ఫలితంతో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టపడ్డ ప్రతి నాయకునికి భవిషత్తు ఉంటుందని రేవంత్ రెడ్డి చెప్పినట్లు వేణుగోపాల్ యాదవ్ తెలిపారు.

హనుమాన్ ఆలయంలో కార్తీక వనభోజనాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వజ్జల శిరీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 నుండి వనభోజనాల ప్రక్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పిన్న వివేక్, రూప్నర్ రమేష్, ఎకరాల శ్రీనివాస్, ఉదయ్, రమేష్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు ఖరారు చేయడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ కూడలిలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సుంకెట రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు మండల కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర చేపట్టిన వెంటనే ఆరుగ్యారంటీలను అమలు చేసేందుకు చర్యలు చేపడతారన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చి మల్లయ్య, పాలేపు నరసయ్య, నల్ల గణేష్ గుప్త, సుంకేట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం చర్చలు జరపాలని ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

బార్దన్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని కార్మికులు గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేసి కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్దాన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలి రేట్ల పెంపు ఒప్పందం జరుగుతుంటే, ఈసారి యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ కూలి రేట్లు పెంచబోమని తెలపడంతో కార్మికులు సమ్మె చేస్తున్నారని అన్నారు, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని, యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని అన్నారు, బార్దాన్ కార్మికుల సమ్మె విరమణకు కార్మిక శాఖ అధికారులు చొరవ చూపి, చర్చలు జరిపి కూలి రేట్లు, ఇతర డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు దండే రాము, నాయకులు అబ్దుల్, విజయ్, రాజు, సురేష్, గంగాధర్, కరుణబాయి, భారతి మరియు బార్దన్ కార్మికులు పాల్గొన్నారు.

గోదావరి మహాహారతి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న క్యాతం వెంకట రమణ

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని గంగానగర్ గోదావరి తీరాన సమ్మక్క-సారలమ్మ జాతర ఘాట్ల వద్ద నేడు సాయంత్రం నిర్వహించనున్న గోదావరి హారతి కార్యక్రమానికి సంబంధించి మున్సిపల్ సూపర్‌వైజర్ బండారి రవి వారి సిబ్బందిచే నదీ తీరంలో చదును చేసి చెత్తా చెదారం తొలగించి భక్తులకు అనువుగా ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను మంగళవారం గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కో-కన్వీనర్ క్యాతం వెంకటరమణతో పాటు పల్లెర్ల చంద్రమౌళి, గందెశ్రీ వీరేశం, తాటిపెళ్ళి వెంకన్న, గజెళ్ళి వెంకటేశ్వర్లు తదితరులు పరిశీలించారు. ఈ మహా హారతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకుర్తి జడ్పీటీసీ కందుల సంధ్యారాణి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మివాణి హాజరు కానున్నారన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ-గోదావరిఖని:
ఎస్ఐఎంఎస్ రామగుండం ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ, సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు సింగ్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, హెచ్ఐవీ వచ్చిన వారిని ఎవరిని చిన్న చూపు చూడకూడదని, వారికి అండగా కుటుంబ సభ్యులు, సమాజం నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని, దీంతో వారు సామాన్య జీవితం పొందవచ్చని తెలిపారు. దీంతోపాటు ప్రభుత్వం తరఫున ఆసరా పెన్షన్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, వైద్యులు శ్రీదేవి, అరుణ, అశోక్, అప్పారావులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు స్వీట్ల పంపిణీ



స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు

నవ తెలంగాణ-రామగిరి
సింగరేణి ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-2 గనిపై కాంట్రాక్ట్ కార్మికులకు ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ ఉయ్యాల కుమారస్వామి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన దుద్దిళ్ల శ్రీధర్ బాబును అఖండ మెజార్టీతో గెలిపించిన కాంట్రాక్ట్ కార్మికులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా శ్రీధర్ బాబు పెద్ద హోదాలో ఉంటారని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల బీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం, డి.రాజేందర్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రత్నం రాజేశం, పులి శ్రీనివాస్, అక్కపాక వెంకటి, అడ్డూరి ఓదెలు, పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవ వేడుకలు



దివ్యాంగులకు షీల్డ్ అందజేస్తున్న సుధాకర్ రావు

నవ తెలంగాణ-రామగిరి
సింగరేణి ఆర్జీ-3 & ఏపీఏ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం సెంటినరీ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుకల్లో భాగంగా గోదావరిఖని మనోచైతన్య సంస్థ, పరిసర గ్రామాలు, పాఠశాలల నుంచి హాజరైన దివ్యాంగులకు మ్యూజికల్ చైర్, బాల్ ఇన్ ద బాస్కెట్, త్రోబాల్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో దివ్యాంగులు పాటలు పాడుతూ, నృత్య ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు.ఈ కార్యక్రమానికి ఆర్జీ-3 ఏరియా జీఎం ఎస్.సుధాకర రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, దివ్యాంగులు భగవంతుడు ఇచ్చిన వరంలాంటి వాళ్ళని, వారిని చిన్నచూపు చూడకూడదని అన్నారు. వివిధ క్రీడల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, డీవైపీఎంలు గుర్రం శ్రీహరి, వడ్లకొండ సునీల్ ప్రసాద్, మనో చైతన్య సంస్థ ఇన్‌చార్జీ కృష్ణకుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బూస వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మక్కాన్‌సింగ్ గెలుపుపై సంబరాలు

నవతెలంగాణ-గోదావరిఖని
రామగుండం నూతన ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ మహిళా లీగల్‌సెల్ కన్వీనర్ గాదే శ్రీలత పటేల్ ఆధ్వర్యంలో గోదావరిఖని కోర్టు ప్రాంగణంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, టపాసులు కాల్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ ఈదుల జానకి, సీనియర్ జూనియర్ న్యాయవాదులు చందాల శైలజ, ప్రసన్న, జ్యోతి, శ్రీలత, భారతి, దేవి చౌహాన్ తదితరులున్నారు.



కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ మహిళా లీగల్ సెల్ కన్వీనర్

టీఎల్ఎం విధానం ద్వారా విద్యాబోధన చేయాలి

▸ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-జూలపల్లి
తరగతి గదిలో తప్పనిసరిగా టీఎల్ఎం విధానం ద్వారా విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జూలపల్లి మండలంలోని కాచాపూర్ మండల ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌కు నీటి సరఫరా అందించేందుకు 35 వేల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం పాఠశాలలో చిన్నారులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. పాఠశాలలో జరుగుతున్న విద్యా బోధన వివరాలను కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదవడం రాయడంలో విద్యార్థులకు ఉన్న ప్రావీణ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం కనీస అభ్యాసన సామర్థ్యాలు పెంచుతూ ప్రత్యేక శ్రద్ధ కనబరిచినప్పుడే ఉపాధ్యాయుని యొక్క జీవితం సార్థకృతి పొందుతుందని కలెక్టర్ అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు బోధన మెలకువలతో విద్యార్థుల యొక్క స్థాయిని నిర్ధారించి వారికి ప్రత్యేక విద్యా బోధన చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్. పీఎంషేక్, ఎంపీటీసీ, గ్రామసర్పంచ్, బంటు ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులతో ముచ్చటిస్తున్న ముజమ్మిల్‌ఖాన్

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన అధికారులు

● ధ్వజమెత్తిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మంథని
ప్రజాస్వామ్యాన్ని కొందరు అధికారులు అపహాస్యం చేశారని కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి,మంథని డివిజన్ మీడియా కన్వీనర్ ఇనుముల సతీష్ ఆరోపించారు.మంగళవారం మంథనిలో సతీష్ విలేకరుల తో మాట్లాడుతూ మంథని అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించి ఐదుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన శ్రీధర్ బాబుకు మంథని నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అఖండ విజయానికి అండదండలు అందించి కష్టపడ్డ మంథని నియోజక వర్గ ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులకు ధన్యవాదాలన్నారు. మంథని నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో పౌరుల హక్కు అని అన్నారు.



మాట్లాడుతున్న పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీష్

పౌరులు ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు వీలు లేకుండా అధికార యంత్రాంగం అనేక లోటుపాట్లతో వ్యవహరించిందని అన్నారు.ప్రధానంగా 1000 నుంచి 1500 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లలో కనీస సౌకర్యాలు తాగునీటి ఏర్పాటు, దివ్యాంగులకు ర్యాంప్ నిర్మాణం,ట్రై సైకిల్ లాంటివి ఏర్పాటు చేయలేదని విమర్శించారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌కు వచ్చిన ఓటర్లు అసౌకర్యాల మధ్య అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండానే అధికార యంత్రాంగం దుర్వినియోగపరిచిందని ఆరోపించారు. 3న ఎన్నికల లెక్కింపు సందర్భంగా పోటీలో ఉన్న అభ్యర్థులు ఏజెంట్లకు సౌకర్యాలు కల్పించడంలో ఎన్నికల అధికారి సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తులకు ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఎవరికి ఎంత మెజార్టీ వచ్చిందో తెలియజేయడంలో అధికారుల వైఫల్యం కనిపించిందన్నారు.మెజార్టీని తక్కువ చేసి చూపించడంలో అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలికారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలిచి చట్టసభలో అడుగు పెడుతున్న గెలిచిన అభ్యర్థుల మెజార్టీని తక్కువ చేసి చూపడం చెల్లిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు 31,717 ఓటు రాగా తగ్గించి చూపడం అవివేకం అన్నారు.ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.ఆయన వెంట ఆర్ల నాగరాజు, ఐలి శ్రీనివాస్ పటేల్, గొల్లపల్లి శ్రీనివాస్,ఆరేల్లికిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

31 లోపు సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

నవ తెలంగాణ -పెద్దపల్లి
డిసెంబర్ 31లోపు సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్, కరీంనగర్, జిల్లాలోని రైస్ మిల్లర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐకి సీఎంఆర్ రైస్ డెలివరీ చేయడంలో ఎదురయ్యే ఇబ్బందులను చర్చించారు.
అనంతరం అదనపు కలెక్టర్ శ్రామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, బాకీ ఉన్న బియ్యాన్ని డిసెం బర్ 31 గడువులోపే డెలివరీ చేయాలని, మిల్లర్ల సమస్యలను పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ డీఎంకు సూచించారు. రైస్ మిల్లర్లు ప్రస్తుత సీజన్ ఖరీఫ్ 23-24 ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని వెంటనే ఓపీఎంఎస్‌లో నమోదు చేసి తద్వారా రైతులకు సత్వరమే చెల్లింపులు జరిగేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డివిజనల్ మేనేజర్ ఎఫ్‌సీఐ కరీంనగర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారి, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

సంజీవ రెడ్డి, జనక్ ప్రసాద్ నాయకత్వంలో వేసిన కమిటీలే అసలైనవి...



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో యూనియన్‌లో వేసి కమిటీలే అసలైనవని ఐఎన్‌టీయూసీ ముఖ్య నాయకులు అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు సదానందం అధ్యక్షతన గోదావరిఖనిలోని జనక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సోమవారం రాత్రి ఐఎన్‌టీయూసీ సభ్యత్వం కూడా లేని పెంచాల తిరుపతి, కొందరు వ్యక్తులు ఐఎన్‌టీయూసీఆర్జీ-1 కమిటీ పేరిట సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆ కమిటీకి ఐఎన్‌టీయూసీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవ రెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ రిజిస్టర్ నెంబర్ 2064 మాత్రమేనని, కార్మికులు ఎలాంటి అయోమయానికి గురి కావద్దని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ జనరల్ సెక్రటరీ వంగ లక్ష్మీపతి గౌడ్, జాయింట్ జనరల్ సెక్రటరీ అరెపల్లి శ్రీనివాస్, బ్రాంచ్ కమిటీ నాయకులు సాగర్, జగన్మోహన్, ఫిట్ సెక్రటరీలు గాదె సంపత్, నర్సయ్య, చారి, గణపతి దామోదర్, కుమారస్వామి, రాజయ్య, సోమేష్, గద్దం వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

దుద్దిళ్లకు మంత్రి పదవి ఖాయం ?

జిల్లాలోని ఒకే ఒక్క సీనియర్ నాయకుడు శ్రీధర్ బాబు

నవతెలంగాణ-మంథని



అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో మంథని నియోజకవర్గంలో బుచ్చి పంతులుగా పేరున్న కీర్తిశేషులు మాజీ స్పీకర్ శ్రీపాదరావు కుమారుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గం నుంచి 5వసారి ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం ఖాయం ఖరారైనట్లు సమాచారం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఒకే ఒక్క సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్ బాబు ప్రస్తుతం టీపీసీసీ మ్యానిఫెస్టో చైర్మన్‌గా ఉండి రూపొందించిన పథకాలతోనే నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు బహటంగానే చెపుతున్నప్పటికీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో పట్టున్న సీనియర్ నాయకుడుగా,రాష్ట్ర, కేంద్ర అధిష్టానంలో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న శ్రీధర్ బాబు కావడంతో ఇటీవల జరిగిన ఎన్నికలతో అధికారంలోకి పార్టీని తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన శ్రీధర్ బాబుకు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటయ్యే కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక మంత్రి పదవి బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తుంది. మంచితనం,సౌమ్యుడిగా ఉన్న శ్రీధర్ బాబుకు ఈ మంత్రివర్గంలో తప్పనిసరిగా రాష్ట్ర మంత్రి హోదా కల్పించే అవకాశం ఉందని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.మంథనిలో ఇప్పుడు ఇదే హాట్ టాఫిక్‌గా మారింది.

ప్రజల తీర్పును గౌరవిస్తున్నా

▸ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతాం
▸ బీఎస్పీ పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జీ దాసరి ఉష

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



మాట్లాడుతున్న దాసరి ఉష

బహుజన్ సమాజ్ పార్టీపై నమ్మకంతో ఓటు వేసి ప్రజాస్వామ్య విలువల్ని మరింత పెంచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతు న్నామని, ప్రజాక్షేత్రంలో గెలుపు ఓటములు సహజమని ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జీ దాసరి ఉష అన్నారు. మంగళవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత రెండున్నర ఏండ్ల నుంచి బహుజన గొంతుకగా పనిచేస్తున్నామని అన్నారు. బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, శ్రేయోభిలాషులు నిరుత్సాహపడవద్దని, ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుని రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేసి విజయం సాధించే దిశగా పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తామన్నారు. తాను ఇక్కడే ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామన్నారు.కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందు పరిచిన హామీల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గొట్టెరాజు, పెద్దపల్లి మాజీ జడ్పీటీసీ ఈర్ల కొమురయ్య, పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, పెద్దపల్లి పట్టణ కౌన్సిలర్లు బొంకూరి భాగ్యలక్ష్మి సన్నీ, రాజం మహంత కృష్ణ యాదవ్, సాబీర్ ఖాన్, మాజీ కౌన్సిలర్ మర్రిపల్లి సతీష్, బీసీ సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సిరవేన స్వప్న ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేష్ పటేల్‌లు పాల్గొన్నారు.

ఆశాలకు,ఏఎన్‌ఎంలకు అవగాహన

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



మాట్లాడుతున్న సాధికారిత కేంద్రం కో ఆర్డినేటర్ దయా అరుణ

పెద్దపల్లి జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడేలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల ఆశాలకు, ఏఎన్‌ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సంద ర్భంగా సాధికారిత కోఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ భేటీ బచావో భేటీ పడాదో ముఖ్య ఉద్దేశం, లింగ వివక్షత, భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, హెల్ప్ లైన్ నంబర్స్ 181, 100, 1098, 14567, పోషక ఆహా ర విలువలు, రుతు క్రమం, సఖి సేవలు, సేఫ్ టచ్-అన్‌సేఫ్ టచ్, బాలికల ఉన్నత చదువు, ఆర్థిక అక్షరాస్యత, గవర్నమెంట్ పథకాలు, పొదుపు ప్రాము ఖ్యతలను వివరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డా. మమత, డా. లావణ్య డా. కీర్తన, హెచ్‌ఈవో సాంబయ్య, ఫైనాన్షియల్ లిటరసీ సంధ్య, మెడికల్ సూపర్‌వైజర్‌లు ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ మేకింగ్, డిబేట్ పోటీలలో గాయత్రి విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



విద్యార్థులను అభినందిస్తున్న గాయత్రి విద్యా సంస్థల అధినేత

వరల్డ్ ఎయిడ్స్‌డే సందర్భంగా జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన, నియంత్రణపై డిబేట్, పోస్టర్ మేకింగ్ పెయింటింగ్ పోటీలలో గాయత్రి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు పోస్టర్ మేకింగ్‌లో కూన పల్లవి (బీటీబీసీ) ప్రథమ బహుమతి, జక్కుల హర్షిత (బీజెడ్సీ), ద్వితీయ బహుమతి, డిబేట్ గ్రూప్ డిస్కషన్‌లో బొడ్డుపల్లి శాలిని (బీటీబీసీ) ప్రథమ బహుమతి, మేకల అక్షయ (బీజెడ్సీ), ద్వితీయ బహుమతి సాధించగా కళాశాల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపల్ జే. రవీందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

టీబీజీకేఎస్ ఏపీఏ బ్రాంచ్ సెక్రెటరీ పదవికి

జక్కుల దామోదర్ రావు రాజీనామా

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:
ఆర్జీ-3 ఏపీఏ టీబీజీకేఎస్ బ్రాంచ్ సెక్రెటరీ పదవికి జక్కుల దామోదర్ రావ్ రాజీనామా చేస్తున్నట్లు ఆయన మంగళవారం వెల్లడించారు.సింగరేణి కార్మికులకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో మంచి పనులు చేసినప్పటికీ ఈ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని కోల్ బెల్ట్ ప్రాంతంలో కార్మికులు ఆదరిం చ నందున నైతిక భాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇన్ని రోజులు సహకరించిన వారందిరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.